మినీకథ

# నాలాగా ఎందరో



ప్రొద్దున లేచినప్పటి నుంచీ మొదలైన పరుగు రాత్రి పక్క దగ్గరే ఆగుతుంది. ప్రతిదానికీ తాపత్రయమే సుమండీ జీవితంలో. తెల్లారితే పాలు వస్తాయో లేదో అని బెంగ, బస్సులో సీటు దొరుకుతుందో లేదోనని బెంగ, ఆఫీసుకు టైముకి చేరతామో లేదోనని బెంగ, ప్రతిదానికీ కంగారే, ఆలోచనే.

ఎన్ని ఉన్నా, పని తప్పదు కదా. గబగబా తయారయి ఇంట్లో పనంతా ఉన్న కాస్త టైములోనే చుట్టబెట్టి (చక్కగానే సుమండీ!) బస్టాపుకొచ్చి నుంచున్నాను. జనం. ఎక్కడ చూసినా జనం. ఎప్పుడు చూసినా జనం. బహుశా తెల్లవారుజామున రెండింటికీ మూడింటికీ మధ్య కన్పించరేమో రోడ్ల మీద. నాలుగయిందంటే మొదలు చీమలు పుట్టల్లోంచి బయటికి వస్తున్నట్లు ఎక్కడ చూసినా పుట్టలు పుట్టలు జనం. అమ్మయ్య. మా బస్ వచ్చేసింది. ఫర్వాలేదు ఇవ్వాళ కాస్త ఖాళీగానే వుంది. గబగబా ఎక్కాను. బస్సెక్కామంటే సగం ఆఫీసు చేరినట్టే అనిస్తుంది. ఏమిటో ప్రక్కవాడి గురించి ఆలోచించే ఓపిక, తీరిక ఎవడికుంటున్నాయి అసలు. ప్రక్కన నుంచున్న అమ్మాయిని చూస్తే జాలేస్తోంది. గర్భవతి కాబోలు. భారంగా కష్టపడ్తూ నిల్చుంది. ఎవరికి వారే రొటీన్ కబుర్లు చెప్పకుంటూనో, వాళ్ళ వాళ్ల ఆలోచనల్లోనో ఉన్నారు బస్సులో జనమంతా. ఆ అమ్మాయిని చూసి అయ్యో! ఎలా నుంచోగలదు ఈ పరిస్థితుల్లో కాస్త సీటిస్తే బాగుంటుందని ఒక్కరికీ అన్పించట్లేదు. బస్సు ఆగినప్పుడల్లా, బ్రేక్ వేసినప్పుడల్లా నా మీదకు ఒరుగుతోంది. ఏమనలేక ఎలాగో సర్దుకుంటున్నాను.

—ఎన్.ఎల్.సరోజ

ఆ ముసలావిడ ఎక్కలేక ఎక్కలేక ఎక్కింది. అటూ ఇటూ చూసి ఎవరూ సీట్ ఇచ్చే ప్రయత్నం చేయకపోయేసరికి నెమ్మదిగా క్రిందే ఓ ప్రక్కగా సర్దుకుంది. ఇంక వచ్చేపోయేవారికి అడ్డం. మీద పడినా, తగిలినా తిట్లు. పొద్దున్నే ఆఫీసు వేళల్లో కొంపలు మునిగినట్లు బస్సులో ఎక్కకపోతేనేం. ఇలా ఆఫీసులకెళ్లే మాలాంటి వాళ్ల ప్రాణం తీయకపోతేనేం. ప్రక్కనమ్మాయి మళ్లీ తగిలేసరికి ఆలోచనలు ఇటు తిరిగాయి. ఆ ముందు సీట్లో కూర్చుని ప్రక్కన కొలిగో, ఫ్రెండో మరి, ఆ అమ్మాయితో లొడా లొడా మాట్లాడుతున్న అమ్మాయిని చూస్తే ఒళ్లు మండుతోంది. బస్సు కదా! ఏం మాట్లాడొచ్చో, ఏం మాట్లాడకూడదో అనే ఆలోచన లేకుండా, వాళ్లాయన గురించి, పిల్లల గురించీ, చీరల గురించీ, వంటల గురించీ వామ్మో! ప్రపంచంలో వున్న విషయాలన్నింటి గురించీ మైకు పట్టుకున్నట్లు అందరూ వినేలా గట్టిగా మాట్లాడేస్తోంది. కాస్త మాటలాపితే వెనకాల కూర్చున్నావిడ ఒళ్ళో పిల్లాడి ఏడుపుతో పిచ్చెక్కిపోతున్న మాకు కాస్తన్నా రిలీఫ్‌గా వుంటుంది కదా. అబ్బే! అలాంటివి ఆలోచించేందుకు టైమే లేనట్లు. లొడ లొడా, గల గలా ఈ అమ్మాయికి ఎవ్వరూ సీటివ్వరు, నాకు ఈ అమ్మాయిని ఆయాసపడ్తూ చూసే బాధా తప్పదులా వుందివ్వాళ. ప్రక్కనే లేడీస్ సీట్లో కూర్చున్న కుర్రాడు కిటికీలోంచి బయటకు చూస్తూ పొరపాటున కూడా తల ఇటు తిప్పట్లేదు ఎక్కడ లెమ్మంటారో అన్నట్లు.

ఒక్కళ్ళకయినా కనీసం జాలి, దయ, సానుభూతి లాంటివి అసలు ఉండట్లేదు ఈ రోజుల్లో. కాకపోతే పిల్లలెత్తుకున్న తల్లులెక్కినా, ముసలాళ్లెక్కినా, గర్భవతులెక్కినా ఓ నిర్లిప్తమైన చూపొకటి పడేసి, తమకేం పట్టనట్లు కూర్చోకపోతే కనీసం ఒక్కసారైనా లేచి వాళ్లకి సీటివ్వటమో, చేతిలో బిడ్డనో, సంచినో అందుకోవటమో చెయ్యవచ్చు కదా! మనమలా కష్టపడ్తుంటే ఎవరైనా సాయం చేస్తే బాగుండునని అనుకోమూ. తమదాకా వస్తే కానీ ఎవరికి తెల్సిరాదులెండి.

ఎన్ని సంవత్సరాలు నెలల్నుంచీ ఈ బస్సులో ప్రయాణం చేస్తున్నా, ప్రతిరోజు కొత్త కొత్త విశేషాలు, విచిత్రాలు జరుగుతూనే వుంటాయి. ఏమిటో జీవితం. టైమెంతయింది? అమ్మో ఇంకో పది నిమిషాల్లో ఆఫీసులో వుండాలి. బస్సు స్టాపెలాగూ ఆఫీసు ఎదురుగానే కాబట్టి రెండు నిమిషాల్లో లోపలికి వెళ్లిపోవచ్చు. అదిగో మా బస్టాపు వచ్చేసింది. ఇవ్వాళ ఆలోచనల్లో పడి అరగంట ప్రయాణం అర నిమిషంలా అయిపోయిందనిపిస్తోంది అనుకుంటూ గబగబా కూర్చున్న సీట్లోంచి లేచి బస్సులో జనాన్ని తోసుకుంటూ బయటపడ్డాను ఆఫీసుకి టైముకి చేరడానికి. ఇంతకీ ఆ గర్భవతమ్మాయికి ఎవరన్నా ఇప్పటికైనా, సీటిచ్చారో, లేదో? అయినా ప్రక్క వాళ్ల గురించి నాలాగా ఒక్కళ్ళో, ఇద్దరో ఎంత ఆలోచిస్తే మాత్రం ఏం లాభం అనుకుంటూ గబగబా ముందుకదుగేసాను.




